

మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఫైనాన్స్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ రాజయ్య

## హనుమాన్ ఆలయంలో సిరిసిల్ల రాజయ్య పూజలు

చంపాపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయాన్ని ఆదివారం తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సందర్శించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న మైసమ్మ ఆలయంలో రాజయ్య ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు తోకటి కిరణ్‌కుమార్, సంతోష్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ గణేష్‌నాయక్, నాయకులు శివ, రమేష్‌రెడ్డి, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.



శాకాంబరి అలంకరణలో దర్శనమిచ్చిన ప్రత్యంగిరా పరమేశ్వరి

## శాకాంబరి అలంకరణలో అమ్మవారు

ఎల్బీనగర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం సందర్భంగా ఆర్కే పురంలోని కుర్తాళ పీఠం ఆదిపరాశక్తి ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ఆదివారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల తాకిడి మొదలైంది. మధ్యాహ్నం వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ప్రత్యేక పూజాధికాలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణాసురేంద్రనాథ్‌యాదవ్, సీఐ సూర్యానాయక్

## శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు దోహదం

మన్సూరాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలను పరిరక్షించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డినగర్‌లో సర్వే నంబర్.58 కాలనీలో అసోసియేషన్ తరపున ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యానాయక్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి విష్ణుచారి, సభ్యులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన శాంతివనం కాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు

## శాంతివనం కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శాంతివనంకాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా డి.కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఫణిందర్, ఉపాధ్యక్షుడిగా శివప్రసాద్‌రాజు, కోశాధికారిగా మెగావత్ గణేష్, కార్యదర్శిగా రాజునాయక్, గౌరవ అధ్యక్షుడిగా నర్సింహారెడ్డితో పాటు ఇతర కమిటీ సభ్యులను కాలనీలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి కృషి చేసిన కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

కొత్తపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ న్యూమారుతీనగర్ కాలనీ సంక్షేమ భవనంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యపరీక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. కాలనీ అధ్యక్షుడు నీరంకి రవి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో సుమారు 200మంది కాలనీవాసులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. విజయ డయాగ్నస్టిక్ సెంటర్, మాక్స్‌విజన్ క్లోవ్ డెంటల్ వైద్యులు డా.అనూప్, డా.అనూష, డా.రజిత బృందం వైద్య పరీక్ష అనంతరం కాలనీవాసులకు తగిన ఆరోగ్య సూచనలు చేశారు. కాలనీ కార్యదర్శి టీ.ప్రభాకర్, ప్రతినిధులు శ్రీనివాస్‌కృష్ణ, రవికేశవ్, అరుణ్‌కుమార్, శంకర్, సుజాత పాల్గొన్నారు.

### భూపేష్‌గుప్తానగర్ కాలనీలో..



ఉచిత వైద్య శిబిరంలో రోగులకు మందులను అందజేస్తున్న వైద్యులు

చంపాపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని భూపేష్‌గుప్తానగర్ కాలనీలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం మీకోసం మేము న్నాం ఫౌండేషన్ చైర్మన్ నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈశిబిరంలో వైద్యులు పలువురికి బీపీ, మధుమేహం, 2డీ ఈకో, ఈసీజీ పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హిమాలయ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్లు ఉమాకాంత్, వినయ్‌రెడ్డి, జ్యోతి, సురేష్, సుమయ్య, శ్రీరేఖ, మేనేజర్ గణేష్‌గౌడ్, రవి, కాలనీప్రతినిధులు శంకరయ్య, మధుసూదన్ పాల్గొన్నారు.



ఖిల్లా మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి సీతక్క, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి తదితరులు



మాతామైదాన్‌లోని విజయదుర్గామాతను దర్శించుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్



హయత్‌నగర్ డివిజన్ వస్తురినగర్‌కాలనీలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తదితరులు



ఎన్‌టీఆర్‌నగర్‌లో బోనాల వేడుకల్లో పాల్గొన్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



విజయదుర్గామాత పూజల్లో మేయర్ విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ స్వర్ణలతారెడ్డి, కమిటీ సభ్యులు శ్రవణ్, సునీల్‌రెడ్డి



కట్టమైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాల్లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఆలయ చైర్మన్ రంగారెడ్డి, సుమన్‌గౌడ్, జంగారెడ్డి



ద్వారకమాయినగర్‌లోని మైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాల్లో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తదితరులు



గాయత్రినగర్ బ్యాంక్‌కాలనీలో బోనాల ఉత్సవాల్లో కార్పొరేటర్ లచ్చిరెడ్డి, సరస్వతి తదితరులు

# ఘనంగా బోనాల సంబరాలు

- కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు
- ఖిల్లా మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సీతక్క

ఎల్బీనగర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల నడుమ బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆర్‌కేపురం డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్‌లోని ఖిల్లా మైసమ్మ ఆలయంలో అమ్మవారికి రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్క పట్టువస్త్రాలు సమర్పించారు. టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ తీగల అనితారెడ్డిలతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు.

### అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి నియోజకవర్గంలోని పలు ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్‌నగర్ ఫేజ్ 1,2,3లలోని ఆలయాలలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

**చంపాపేట** : చంపాపేటలోని పోచమ్మ ఆలయంలో నల్ల, ఎర్ర పోచమ్మ అమ్మవార్లను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

**ఓల్డ్‌మలకపేట** : ఓల్డ్‌మలకపేట మున్సిపల్ కాలనీలోని పోచమ్మ ఆలయంలో ప్రజలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. సౌత్‌ఈస్ట్ జోన్ డిప్యూటీ కమిషనర్ చైతన్యకుమార్, అడిషనల్ డీసీపీ శ్రీకాంత్, చాదర్‌ఘాట్ సీఐ బ్రహ్మమురళిలు అమ్మవారిని దర్శించుకున్నారు.

**కొత్తపేట** : కొత్తపేట డివిజన్‌లోని జనప్రియనివాస్ -12, మోహన్‌నగర్ జనప్రియక్వార్టర్స్, బాలాజీనగర్, ఆర్‌టీఐకాలనీ, రాజీవ్‌గాంధీనగర్, భరత్‌నగర్‌లో నిర్వహించిన బోనాల వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అమ్మవార్ల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

**సైదాబాద్** : సైదాబాద్ మాతామైదాన్‌లోని విజయదుర్గమాత ఆలయానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**హయత్‌నగర్** : హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పద్మావతి, రాఘవేంద్ర, బీడీఎల్, వస్తురినగర్, అరుణోదయనగర్ కాలనీల్లో బోనాల వేడుకలను జరుపుకున్నారు. ఆయా కాలనీల్లోని ఆలయాలను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**వనస్థలిపురం** : వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్ డివిజన్‌లలో బోనాల వేడుకల్లో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సామ రంగారెడ్డి పాల్గొన్నారు.

**మన్సూరాబాద్**: మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారారోడ్డులో పోచమ్మ ఆలయంలో బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, బీజేపీ నాయకుడు సామ రంగారెడ్డి పాల్గొన్నారు.

### జిల్లా కోర్టుల ఆవరణలో..

**రంగారెడ్డి జిల్లా కోర్టులు** : రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో ఆషాఢ బోనాల వేడుకల్లో న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి కార్తీక్ పాల్గొన్నారు.



బోనమెత్తిన కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి



నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి దంపతులు



నాగోల్‌లోని గోల్డెన్‌లీవ్స్ విల్లా వద్ద బోనాల వేడుకల్లో కార్పొరేటర్ అరుణాసురేంద్రనాథ్‌యాదవ్



బోనాలు సమర్పించేందుకు క్యూలో నిల్చున్న భక్తులు



దేవిపోచమ్మ, ద్యాసాంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాల్లో కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏసీపీ పల్లె కాశిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు



మాదన్నపేట పోచమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న సౌత్‌ఈస్ట్ డీసీపీ చైతన్యకుమార్



భక్తులతో బోనాలను ఊరేగింపుగా తీసుకు వస్తున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి



ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ ఆలయం వద్ద బోనాలు సమర్పించటానికి బారులు తీరిన భక్తులు



హయత్‌నగర్ డివిజన్‌లో బోనాలతో మహిళలు



గడ్డిఅన్నారంలో ఈదమ్మకు మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్, కాంగ్రెస్ మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్



చంపాపేట డివిజన్ కుమ్మరిబస్తీలోని ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

# పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించండి

- పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి
- మండల పరిషత్ కార్యాలయంలో టీపీఎస్‌ఏ రాష్ట్ర స్థాయి సమావేశం



టీపీఎస్‌ఏ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు


**అబ్దుల్లాపూర్‌మెట్** : హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్(టీపీఎస్‌ఏ) రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. టీపీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారంపై చర్చించి పలు డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ 14 నెలలుగా పంచాయతీలో పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేస్తూ ఓపీఎస్‌లను వెంటనే క్రమబద్ధీకరించాలని, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు ఏళ్ల సర్వీసును పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యదర్శులకు పదోన్నతి కల్పించి, జీఓ ఎంఎస్ నంబర్ 317 ద్వారా నష్టపోయిన కార్యదర్శులను సొంత జిల్లా, జోన్‌లకు బదిలీ చేయాలన్నారు. మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ విధానంలో నియమించిన కార్యదర్శులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో నష్టపోయిన వెంటనే పదోన్నతి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. వీటన్నింటిపై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీపీఎస్‌ఏ ప్రధాన కార్యదర్శి ఈ.శ్రీనివాస్, కోశాధికారి పండరీనాథ్, నాగేష్, మధుసూదన్‌రెడ్డి, డీవీ రమణారెడ్డి, రాజేస్‌గౌడ్, సురేంద్ర, శ్రీకాంత్, అరుణ్, కవిత, లక్ష్మీనారాయణ, వివిధ జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

## దాశరథి సాహిత్యం తెలుగు భాషకు కోటి రతనాల వీణ

**చిక్కడపల్లి** : దాశరథి కృష్ణమాచార్య సాహిత్యం తెలుగు భాషకు కోటి రతనాలవీణ అని ప్రముఖులు అన్నారు. కిన్నెర ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో డా.దాశరథి కృష్ణమాచార్య శతజయంతి వేడుకల సందర్భంగా ప్రముఖ సాహితీ విమర్శకుడు డా.కసిరెడ్డి వెంకటరెడ్డికి కిన్నెర దాశరథి సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ పురస్కారం బహూకరించి మాట్లాడారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహాకవులు ఎందరో ఉన్నారని, దాశరథి సాహిత్యం నిజాం నవాబుపై ధిక్కారస్వరంగా మారిందని అన్నారు. అధ్యక్షత వహించిన రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు కేవీ.రమణాచారి మాట్లాడుతూ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధునిక కాలం వివేకానందుడు అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ ఉడయవర్లు, దాశరధి కుమార్తె ఇందిర, రచయిత ప్రభాకర్ తమ అభినందనలు తెలిపారు. రఘురామ్, బాలకామేశ్వరరావు, నాగేశ్వరరావు, సురేఖ, లక్ష్మి పాల్గొన్నారు.

# పుస్తకాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- గ్రంథాలయాలను అభివృద్ధి పర్చాలి : వక్తలు



సమాజానికి బహిరంగ లేఖ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించిన యాకుబ్, వేణుగోపాల్, గుడిపాటి, ఏకే.ప్రభాకర్, పసునూరి రవీందర్ తదితరులు

రాంనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పుస్తకాలను కొనుగోలు చేయాలని, గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని, గ్రంథాలయ సెస్‌ను వాటి అభివృద్ధికి కేటాయించాలని, పాఠశాలల్లో గ్రంథాలయాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలుగు రాష్ట్రాలలో మరో గ్రంథాలయ ఉద్యమాన్ని ఐక్య ఉద్యమంగా రూపొందించాలనే ఎజెండాతో మొదటి ప్రయత్నంలో భాగంగా రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. మంచి పుస్తకం నరేష్, కవి యాకుబ్, ఎం.వేణుగోపాల్, గుడిపాటి, ఎ.కె.ప్రభాకర్, పసునూరి రవీందర్, జి.ఉమామహేశ్వర్, రమేష్‌బాబు, కందుకూరి రాము, గిరిజ, కస్తూరి ప్రభాకర్, జలాది సుధీర్, మోత్కూరి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. భావితరాల భవిష్యత్ కోసం తెలుగు రాష్ట్రాల్లో మరో గ్రంథాలయ ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నేటి తరం పిల్లలు పుస్తకాలు కొనడం, చదవడం లేదని, గ్రంథాలయాలకు వెళ్లడం లేదని అన్నారు. శుభ కార్యాలయాలలో పుస్తకాలు ఇచ్చే సంస్కృతి పోయిందన్నారు. పిల్లలతో పుస్తకాలను పరిచయం చేయాలని, పుస్తక సంస్కృతిని పెంచే కార్యక్రమం చేపట్టాలన్నారు. తెలంగాణ గ్రంథాలయ ఉద్యమ కమిటీని ఏర్పాటు చేసుకుని జిల్లాలు, గ్రామస్థాయి వరకు మరోగ్రంథాలయ ఉద్యమం విస్తరింపచేయాలన్నారు. ఈ సందర్భంగా మంచికంటి రచించిన సమాజానికి బహిరంగ లేఖ పుస్తకావిష్కరణ చేశారు.



నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యానాయక్‌తో కలిసి సైక్లింగ్ లీగ్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

## రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తోందని, ఇందులో భాగంగా క్రీడలకు సంబంధించిన యూనివర్సిటీలను సైతం ఏర్పాటు చేయనున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలోని సెంట్రల్ వాటర్ బోర్డు రీజినల్ కార్యాలయంలో ఆదివారం అస్మిత ఉమెన్స్ సైక్లింగ్ సిటీ/డిస్ట్రిక్ట్ లీగ్‌ను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జెండా ఊపి ప్రారంభించారు. తారావిస్ మ్యాక్స్‌వెల్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సైక్లింగ్ లీగ్‌లో సుమారు 200మంది క్రీడాకారినులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ క్రీడలన్నా, క్రీడాకారులన్నా తనకు ఎంతో గౌరవమని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తనవంతు సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్య నాయక్, జిల్లా బ్యాడ్మింటన్ కోశాధికారి హర్ష, శ్రీకాంత్ మన్నేర్, లారినే, శ్రీనివాస్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## నేడు సైదాబాద్‌లో ఘటాల ఊరేగింపు

సైదాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లో ఘటాల ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రద్ధాబాద్ మహంకాళి జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ సుభాష్‌చందర్జీ తెలిపారు. సాయంత్రం జరిగే అమ్మవారి గావు, ఫలహార బండ్ల ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్, ఎమ్మెల్యేలు పాయల్‌శంకర్, హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, అంజిరెడ్డి హాజరుకానున్నారని వివరించారు.

## ప్రయాణికుల ల్యాప్‌టాప్‌లు చోరీ

**బర్కత్‌పుర** : ఇద్దరు రైలు ప్రయాణికుల ల్యాప్‌టాప్‌లను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అబిడ్‌పేటకు చెందిన నోరి మంగళస్వప్న(20), హయత్‌నగర్‌కు చెందిన నవీన్(25) విశాఖపట్నం, మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ వేర్వేరు రైళ్లల్లో ప్రయాణం చేశారు. వారి ల్యాప్‌టాప్‌లను దొంగలు తస్కరించినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.